

గురుకులాల్లో ఇంటర్ మిగులు సీట్లు భర్తీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జిల్లాలోని అంబేద్కర్ గురుకులాల్లో ఇంటర్ మిగులు సీట్లు భర్తీ చేసినట్లు ప్రిన్సిపల్ కె.ఉషారాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో మొత్తం 134 ఖాళీలుండగా 87 సీట్లు భర్తీ చేసినట్లు ఆమె చెప్పారు. కౌన్సెలింగ్‌లో నెల్లిమర్ల, చీపురుపల్లి, వియ్యంపేట, వేపాడ, గరుగుబిల్లి, కొమరాడ ప్రిన్సిపల్స్ టి.ఎం.ఫ్లోరెన్స్, టి.జయశ్రీ, ఎ.రాణిశ్రీ, ఎల్.పద్మావతి, టి.రామదాసు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న గురుకులాల ప్రిన్సిపల్స్

అమ్మో జూన్

జూన్ మాసం వచ్చిదంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఒకటే టెన్షన్. ముఖ్యంగా చదువుకునే పిల్లలున్న ఇళ్లలో మరింత ఆందోళన ఉంటుంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం ఇలా అన్ని ఖర్చులూ ఒకే సారి వస్తాయి. ఇక ఖరీఫ్ సీజన్ కూడా ఈ నెల నుంచే ప్రారంభం అవుతుంది. తొలకరి వర్షాలు పడడంతో రైతులు ఖరీఫ్ సేద్యాన్ని ప్రారంభిస్తారు. పంటల సాగు నిమిత్తం పెట్టుబడుల కోసం రైతుల వెతుకులాట ప్రారంభం అవుతుంది. ఓ వైపు విద్యా సంవత్సరం.. మరో వైపు ఖరీఫ్ సీజన్ ఒకే సారి ప్రాంభం కావడంతో అన్ని కుటుంబాలపైనా ఏదో ఒక రూపంలో జూన్ భారం పడుతుంది.

- ప్రజాశక్తి, విజయనగరం

- భారీగా పెరిగిన ఫీజులు, వ్యవసాయ పెట్టుబడుల భారం
- తలలు పట్టుకుంటున్న తల్లిదండ్రులు, రైతులు

ఫీజుల భారం..!

వేసవి సెలవులు ముగింపు దశకు వచ్చేశాయి. మరో 10 రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ప్రయివేటు పాఠశాలలు తెరిచారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లను చేసేశారు. పుస్తకాలు వచ్చాయని, వెంటనే తీసుకోవాలని, లేదంటే ఉండవని తల్లిదండ్రులకు ఫోన్లుమీద ఫోన్లు చేస్తున్నారు. పుస్తకాలు కొనుగోలు చేయాలంటే ముందస్తు ఫీజు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇద్దరు విద్యార్థులున్న కుటుంబంలో ప్రయివేటు పాఠశాల అయితే రూ.50వేలు, కార్పొరేట్ పాఠశాల అయతే రూ.80వేలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. ఫీజుల మోతతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, అమ్మఒడి లాంటి పథకాల అమలు చేస్తున్నా ఇవి పెరిగిన పుస్తకాలు, ఫీజుల ధరలకు ఏ మూలకూ సరిపోవడం లేదు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో 320 వరకు ప్రయివేటు పాఠశాలలు, 30 వరకు కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు లక్ష మందికి పైగానే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ నోట్ల కట్టలతోనే పాఠశాలలకు వెళ్లాలి. నర్సరీ స్థాయి నుంచే ఫీజుల రూపంలో రూ.25 నుంచి రూ.50వేల వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. విద్యార్థి తరగతి పెరిగే కొద్దీ ఫీజుల భారం కూడా పెరుగుతూ పోతోంది. హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, యూని ఫామ్స్ ఇలా అన్నింటికీ లక్షల్లోనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇంట్లో ఇద్దరు పిల్లల ఉంటే ప్రస్తుతం కొంత ఫీజు కట్టి, పుస్తకాలు, యూనిఫాం తీసుకోవాలంటే రూ.70వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఇంటర్, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు అయితే వారు చదివే కళాశాలలను బట్టి ఒక్కొక్కరికి హాస్టల్, ఫీజులకు రూ.3 లక్షల వరకు ఖర్చు వస్తోంది. టెక్నో, సిబ్యాచ్, ఐకాన్, ఐపిఎల్, నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ తదితర వాటికి మరింత అదనంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. డబ్బున్న వారికి ఇది పెద్ద సమస్య కాకున్నా సామాన్యులు, చిరుద్యోగులకు పెనుభారంగానే ఉంటోంది. ఫీజుల నియంత్రణ అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులను క్రమబద్ధీకరించి ఫీజుల వసూళ్లపై నిఘా ఉంచితే సామాన్యులకు విద్య భారం కాకుండా ఉటుంది.

నోట్ల కట్టలతో విద్యాలయాలకు..!

ఒకప్పుడు విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో విద్యాలయానికి వెళ్లేవారు. కార్పొరేట్ విద్యా వ్యాపారం రాకతో తల్లిదండ్రులు నోట్ల కట్టలతో అక్కడికి వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. గడిచిన పదేళ్ల కాలంలో వందలు వేలుగా, వేలు లక్షలుగా ఫీజులు పెరిగాయి. కార్పొరేట్ పాఠశాల అంటే చాలు లక్షల్లోనే ఫీజుల మాట విన్పిస్తోంది. అది కూడా ఎల్‌కెజి, యుకేజీ స్థాయికే ఈ స్థాయిలో డబ్బులను తల్లిదండ్రులతో లాగేస్తున్నారు. తమ పిల్లలు తమలా కాకుండా.. మంచిగా జీవితంలో స్థిర పడాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు వారి కష్టాన్ని మొత్తం ఫీజుల రూపంలో ప్రయివేటు, కార్పొరేట్‌కు దారబోస్తున్నారు.

రైతులకు పెట్టుబడుల భారం



జూన్ నెల రైతులపై కూడా భారాన్ని తెస్తుంది. ఖరీఫ్ సీజన్ ఈ సమయంలోనే ప్రారంభమై రైతులు పొలం పనులు ఉపక్రమిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సబ్సిడీపై విత్తనాలు, ఎరువుల పంపిణీకి అధికారులు సిద్ధమయ్యారు. గత పది రోజులుగా అడపా దడపా వర్షాలు కురవడంతో పలుచోట్ల రైతులు పొలంలో దుక్కుల పనుల్లో నిమగ్నం అయ్యారు. గతేడాది సరిగా పంటలు చేతికందక పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. ఉద్యానవన రైతులు కూడా దిగుబడులు రాక నష్టాలను చవిచూశారు. ఈ నేపథ్యంలో రైతుల చేతిలో చిల్లిగవ్వలేకుండానే వ్యవసాయ పనులను ప్రారంభించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విత్తనాలు, పురుగు మందుల కొనుగోలు, పొలం పనులు, కూలీలు ఇతరత్రా వాటికి ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడులు ఖర్చు చేయాల్సి ఉంది. ఇటీవల ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే ఇది ఉమ్మడి జిల్లాలో 20 శాతం మంది రైతులకు కూడా అందలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టుబడి రాయితీ కింద ఎకరాకు రూ.20వేలు సాయం అందించి పంట సాగును ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం ఇవ్వకుండానే..

భూములు తీసేసుకున్నారు

రీసుపేట వాసుల ఆవేదన

జిఎంఆర్ సంస్థకు కేటాయించిన భూములు

ప్రజాశక్తి-భోగాపురం

అత్తసొమ్ము అల్లుడు దానమంటే ఇదేనేమో.. విమానాశ్రయం నిర్మిస్తున్న జిఎంఆర్ సంస్థ సిబ్బంది ఉండేందుకు తమ తాత తండ్రుల నుంచి అనగా సుమారు వందేళ్ల పైబడి రైతులు సాగుచేసుకుంటున్న 21 ఎకరాల భూములను కనీసం రూపాయి నష్ట పరిహారం ఇవ్వకుండానే ప్రభుత్వం ఆ సంస్థకు అప్పజెప్పింది. ఏమంటే మీ దగ్గర ఏమైనా పట్టాలు ఉంటే చూపించండి అంటూ అధికారులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. గత రెండు రోజులుగాహద్దులు నిర్ణయించడంతో రైతులు అడ్డుకున్నారు. చివరకు శుక్రవారం నుంచి ఏన్నో ఏళ్ళు నుంచి పెంచిన జీడితోటలను జిఎంఆర్ సంస్థ జెసిబిలతో తొలగించడం ప్రారంభించింది. దీంతో సుమారు 40మంది రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇది తూడెం పంచాయతీ బసవపాలెం రెవెన్యూలో జరుగుతున్న వివాదం. అయితే ఎన్నికల వేళ ఓట్లుకోసం కనబడిన ఇటు కూటమి నాయకులు, ఆటు వైసిపి నాయకులు గాని కనీసం రైతుల బాధలను పట్టించుకోవడం లేదు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2200 ఎకరాల్లో జిఎంఆర్ సంస్థ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు ఆ సంస్థ సిబ్బంది ఉండేందుకు భూమి కావాలని ఆ సంస్థ రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేయడంతో ఆగమేఘాల మీద దివీస్ కంపెనీ సమీపంలోని బసవపాలెం రెవెన్యూలో సర్వే నెంబరు 25లో ఉన్న 21 ఎకరాలు భూమిని గుర్తించారు. అనంతరం ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకువెళ్ళడంతో వెంటనే ఆ సంస్థకు కేటాయించారు. ఈ భూమిపై రీసుపేట గ్రామానికి చెందిన సుమారు 40 యాత కులస్థులు సుమారు వందేళ్ళ పైబడి తమ తాత తండ్రుల నుంచి పంటలు పండించుకుంటూ చివరకు జీడితోటలు వేసుకున్నారు. దాంతో వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల భూముల సర్వే జరుగుతుందని గమనించి ఆ తోటల్లో ఏపుగా పెరిగిన తుప్పలను జెసిబిలతో వేల రూపాయలు పెట్టి తొలగించారు.

నష్టపరిహారం ఇవ్వాలని అధికారులను కోరుతున్న రైతులు

రెవెన్యూ అధికారుల తీరుతోనే పరిహారానికి దూరం

ఎప్పటి నుంచో రైతులు జీడితోటలు వేసి జీవనం సాగిస్తున్నప్పటికీ వారికి పరిహారం ఇవ్వకుండా జిఎంఆర్ సంస్థకు ప్రభుత్వం అప్పజెప్పింది. అయితే రైతులు సాగు చేసుకుంటున్న విషయాన్ని ప్రభుత్వ దృష్టికి రెవెన్యూ అధికారులు తీసుకువెళ్ళకపోవడం వలనే తమకు నష్ట పరిహారం అందలేదని రైతులు వాపోతున్నారు. ఖాళీగా భూమి ఉందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆ సంస్థకు కేటాయించి ఉంటుందని రైతులు అంటున్నారు. కనీసం రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వకుండా ఇంత దౌర్జన్యంగా చెట్లు నరికేస్తుండడం దారుణమని అంటున్నారు. అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని అధికారులు బెదిరిస్తున్నారని రైతులు అంటున్నారు.

ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేస్తున్నాం

మా కుటుంబానికి ఇక్కడ 4ఎకరాలు భూమి ఉంది. ఈ ప్రభుత్వ భూమిని ఎన్నో ఏళ్ళ నుంచి తమ తాత తండ్రుల కాలం నుంచి సాగు చేస్తున్నాం. కాని మాకు ప్రభుత్వం పట్టాలు నేటికీ ఇవ్వలేదు. అయినప్పటికి సాగులో ఉండి జీడితోటలు వేసుకొని వాటితో వచ్చే ఫలసాయంతో జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు మా భూములకు కనీసం నష్ట పరిహారం ఇవ్వకుండా స్వాధీనం చేసుకుంటున్నారు.

- రీసు అప్పయ్యమ్మ, రైతు, రీసుపేట

జిఎంఆర్ సంస్థ కోసం మా పొట్ట కొడతారా?

జిఎంఆర్ సంస్థ సిబ్బంది ఉండేందుకు ఇంకెక్కడా భూములు లేవా..? పేదలమైన మా భూములే తీసుకుంటున్నారు. కనీసం రూపాయి కూడా నష్ట పరిహారం ఇవ్వలేదు. అడ్డుకుంటే కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. పరిహారం కావాలంటే పట్టాలు ఏమైనా ఉంటే చూపించమంటున్నారు. ఆ పట్టాలు ఇవ్వాల్సిన అధికారులు ఇవ్వకపోతే మేము ఎక్కడ నుంచి తెస్తాం. మాకు నష్ట పరిహారం ఇప్పించాలని అధికారులను కోరుతున్నాం.

- సంబంగి గంభీరమ్మ, రైతు, రీసుపేట గ్రామం

పట్టాలుంటేనే పరిహారం

ప్రభుత్వం జిఎంఆర్ సంస్థకు ప్రభుత్వ భూమిని కేటాయించింది. ప్రస్తుతం రైతులు వద్ద ఆ భూములకు సంబంధించిన ఎటువంటి పట్టాలు లేవు. వారితో సమావేశం నిర్వహించి ఎటువంటి ఆధారం ఉన్నాసరే ప్రభుత్వానికి పరిహారం కోసం నివేదిక పంపిస్తాం. అలాగని పనులు అడ్డుకోవద్దని రైతులకు చెప్పాం.

- పి. శ్యామ్ ప్రసాద్, తహశీల్దారు, భోగాపురం

పాఠ్యపుస్తకాలు అరకొరే

విద్యార్థులకు సకాలంలో అందేనా ?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ ఏడాది కూడా పాఠశాలల పునప్రారంభం నాటికి ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు సంపూర్ణంగా అందించే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాకు అవసరమైన పుస్తకాల్లో సగం మాత్రమే ఇప్పటి వరకు వచ్చాయి. ఎన్నికలు రావడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో జాప్యం చోటు చేసుకుంది. ప్రభుత్వ యంత్రాంగం అధిక భాగం ఎన్నికల పనిలో ఉండడంతో పాఠ్యపుస్తకాల పంపిణీపై తగిన శ్రద్ధ చూప లేదు. దీంతో జూన్ 12న పాఠశాలలు తెరుస్తున్నప్పటికీ పాఠ్యపుస్తకాలు ఇవ్వలేని స్థితి ఉంది. జిల్లాలో ఒకటి నుంచి 7వ తరగతి విద్యార్థులకు 9.33 లక్షలు పుస్తకాలు అవసరం ఉంది. ఇప్పటివరకు 5.70లక్షల పుస్తకాలు వచ్చాయి. 8 నుంచి 10 తరగతి విద్యార్థులకు పుస్తకాలు ముద్రణ సంస్థల నుంచి నేరుగా మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాలకు చేరుకుంటున్నాయి. అవి కూడా 5.84 లక్షలు పాఠ్యపుస్తకాలకు, 4.55 లక్షలు వరకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

8,9,10 తరగతుల పుస్తకాలు మండల విద్యాశాఖాధికారులకు పంపుతుండగా మిగిలిన తరగతుల పుస్తకాలు విజయనగరంలోని గోదాముకు చేరుతున్నాయి. 9, 10 తరగతుల విద్యార్థులకు సరిపడా పుస్తకాలు సంపూర్ణంగా పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు చేరుతాయని డిఇఒ ప్రేమ్ కుమార్ తెలిపారు.

లారీతో చేరుకున్న పుస్తకాలు

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- రెండు ప్రదేశాల్లో ఓట్ల లెక్కింపు
- జిల్లాలో 144 సెక్షన్ అమలు
- ప్రశాంత కౌంటింగ్‌కు అంతా సహకరించాలి : జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఓట్ల లెక్కింపునకు జిల్లాలో దాదాపు ఏర్పాట్లు పూర్తి అయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. జూన్ 6వ తేదీ వరకు జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, అప్పటివరకు ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదని ఆమె స్పష్టం చేశారు. జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు మద్యం షాపులను మూసివేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రంలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని లేదంటే ఆర్ఓల ద్వారా వారిపై చర్య తీసుకుంటామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా పూర్తి చేసేందుకు ప్రతీఒక్కరూ సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియకు చేసిన ఏర్పాట్లను, శుక్రవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి వివరించారు.

రెండు చోట్ల లెక్కింపు కేంద్రాలు

జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల లెక్కింపు కోసం రెండు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశాం. జెఎన్‌టియుజివిలో బొబ్బిలి, విజయనగరం, లెండి ఇంజినీరింగ్ కళాశాలలో చీపురుపల్లి, రాజాం, గజపతినగరం, ఎస్.కోట, నెల్లిమర్ల నియోజకవర్గాలకు అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్లకు వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం

జూన్ 4 వ తేదీన ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. ఆరోజు కౌంటింగ్ సిబ్బంది అంతా ఉదయం 6 గంటలకు, ఏజెంట్లు ఉదయం 7 గంటలకల్లా తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుంది, అరగంట తర్వాత ఇవిఎం ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. విజయనగరం పార్లమెంటు స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో (ఎచ్చెర్లతో సహా) పార్లమెంటుకు పోలైన పోస్టల్ బ్యాలెట్లన్నీ లెండి ఇంజినీరింగ్ కళాశాలలోనే లెక్కిస్తారు. విశాఖ పార్లమెంటు స్థానం పరిధిలో ఉన్న ఎస్.కోట నియోజకవర్గంలో, ఎంపికి పోలైన పోస్టల్ బ్యాలెట్ మాత్రం విశాఖపట్నంలో లెక్కిస్తారు. అసెంబ్లీకి పోలైన పోస్టల్ బ్యాలెట్, ఇవిఎం ఓట్లను మాత్రం జిల్లాలోని ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల్లోనే లెక్కిస్తారు.

ఒక్కో నియోజకవర్గానికి పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు నిమిత్తం మొత్తం 4 లెక్కింపు టేబుళ్లను, ఇవిఎం ఓట్ల కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు.

సర్వీసు ఓటర్ల కోసం కేటాయించిన ఇటిపిబి ఓట్ల లెక్కింపు కూడా, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రాల్లోనే నిర్వహిస్తారు. వీటికోసం వేరేగా టేబుళ్లను ఏర్పాటు చేశారు. వివి ప్యాట్ స్లిప్పుల లెక్కింపు కోసం ఇవిఎం ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోనే ప్రత్యేక క్యాబిన్‌లను ఏర్పాటు చేశారు. ఫలితాలను ప్రకటించడానికి ప్రతీ లెక్కింపు కేంద్రంలో బోర్డులను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలవద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను, బారికేడింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతీచోటా తనిఖీలు నిర్వహిస్తారు.

టేబుళ్ల ఏర్పాటు

అసెంబ్లీ పోస్టల్ బాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో కేంద్రంలో నాలుగు టేబుళ్ల ను ఏర్పాటు చేశారు. అన్ని నియోజక వర్గాల పార్లమెంట్ పోస్టల్ బాలెట్ ఓట్ల లెక్కింపు కోసం లెండి కళాశాల లెక్కింపు కేంద్రంలో 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఇవిఎంల ఓట్ల లెక్కింపు కేంద్రంలో వరుసకు ఏడు చొప్పున మొత్తం 14 టేబుళ్లఏర్పాటు చేశారు.

రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరుగా రాజాంకు 21 రౌండ్లు, బొబ్బిలికి 19, చీపురుపల్లికి 19, గజపతినగరం 19, నెల్లిమర్లకు 18, విజయనగరం 19, ఎస్.కోట కు 20 రౌండ్ల చొప్పున ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అన్ని టేబుళ్ల వద్దా లెక్కింపు పూర్తయి, ఆ రౌండ్ ఫలితాలను ప్రకటించిన తరువాతే తదుపరి రౌండ్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది.

కౌంటింగ్ సిబ్బంది నియామకం

ర్యాండమైజేషన్ ద్వారా మొత్తం 972మందిని కౌంటింగ్ కోసం కేటాయించగా,వీరిలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు 289 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 340 మంది, మైక్రో అబ్జర్వర్లు 343 మందిని నియమించారు. ఇవిఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్దా ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్ (గెజిటెడ్), ఒక కౌంటింగ్ అసిస్టెంట్ , ఒక కౌంటింగ్ స్టాఫ్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. పోస్టల్ బాలెట్ కౌంటింగ్ కోసం ప్రతీ టేబుల్ వద్దా ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, ఒక కౌంటింగ్ సూపర్ వైజర్ (గెజిటెడ్), ఇద్దరు కౌంటింగ్ అధికారులు (గెజిటెడ్) , ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు.

కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లుగా నియామక పత్రం ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారు. ఒక అధికారిక వీడియోగ్రాఫర్ ద్వారా మొత్తం కౌంటింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో సిసి కెమేరాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు ఎవరికి ఓటు వేశారన్న రహస్యానికి భంగం వాటిల్లకుండా లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారు.

ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు

కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకూ అనుమతి ఉండదు. మొబైల్ ఫోన్లు, కెమెరాలు, ఎలక్ట్రానిక్ వాచ్ లు తదితర ఏవిధమైన ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, 17 సి ఫారం, తెల్ల కాగితం మాత్రమే తమతోపాటు తీసుకొని రావాలి.

సాధారణ ఎన్నికల పరిశీలకులు

ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు, అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న కౌంటింగ్‌ను పరిశీలించడానికి నియమితులైన ఏడుగురు సాధారణ పరిశీలకులు లెక్కింపు కేంద్రాల్లో ఉండి పరిశీలిస్తారు.

జిల్లాలో 144 సెక్షన్

జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుంది. లెక్కింపు కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు, నిఘా ఏర్పాటు చేశారు. సిసి కెమేరాలు,రెండు డ్రోన్లు నిరంతర నిఘా ఉంటుంది. ఇతరులు డ్రోన్లు, ఎగిరే పరికరాలు ఆ ప్రాంతంలో ఎగర వేయకుండా, లెక్కింపు కేంద్రాలను నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు. ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యాక కూడా ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదు. విధిగా ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

కౌంటింగ్ ఏజెంట్లకు సూచనలు

పోటీలో వున్న అభ్యర్థుల తరపున కౌంటింగ్ కేంద్రాలకు హాజరయ్యే ఏజెంట్లు కౌంటింగ్ రోజు ఉదయం 6గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి. వారు అల్పాహారం, భోజనం తగిన మొత్తం చెల్లించి అక్కడ ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో పొందే సౌకర్యం కల్పించారు.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

పబ్లిక్ కమ్యూనికేషన్ రూం

రెండు కౌంటింగ్ సెంటర్ల వద్దా అభ్యర్థులు, ఏజెంట్ల మొబైల్ ఫోన్లను స్వీకరించి భద్రపరచడానికి పబ్లిక్ మ్యూనికేషన్ రూంలను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్‌ను ఇక్కడే డిపాజిట్ చేయాలి. అవసరమైనప్పుడు వచ్చి తమ ఫోన్‌ను తీసుకొని పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్ వద్ద మాత్రమే మాట్లాడాల్సి ఉంటుంది. మళ్లీ లెక్కింపు కేంద్రాల్లోకి వెళ్లేటప్పుడు సెల్‌ఫోన్ ను తిరిగి స్వాధీనపర్చాలి.

ప్రథమచికిత్సా కేంద్రాలు

అత్యవసర పరిస్థితిలో వైద్య సేవలను అందించేందుకు రెండు కౌంటింగ్ సెంటర్ల వద్దా ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు చోట్లా 108 అంబులెన్సులను కూడా అందుబాటులో ఉంచుతారు.

మీడియా సెంటర్

రెండు కౌంటింగ్ కేంద్రాల వద్ద మీడియా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రల్లోకి విడిగా మీడియాకు అనుమతి లేనందున, ఐఅండ్‌పిఆర్ సిబ్బంది, పోలీసు ఎస్కార్ట్ తో వెళ్లి ఒకేసారి విజువల్స్, ఫొటోలను తీసుకోవాల్సి ఉంటుంది. వారికీ అవసరమైన ఇంటర్నెట్ సౌకర్యం, టివి లను మీడియా కేంద్రం వద్ద ఏర్పాటు చేశారు. మీడియా ప్రతినిధులకు మీడియా సెంటర్ వరకు మొబైల్ ఫోన్‌లు తీసుకు వెళ్లేందుకు అనుమతిస్తారు. మొబైల్ ఫోన్ లో వీడియో చిత్రీకరణ, ఫోటోలు తీసేందుకు అనుమతించరు.

బాబోయ్.. ఎండలు

బెంబేలెత్తిపోతున్న జనం ● అల్లాడుతున్న మూగజీవాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండుతున్న ఎండలతో జనం అల్లాడిపోతున్నారు. రోహిణి కార్తెలో ఎండలు తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలు అధికంగా ఉండడంతో బయటకు వచ్చేందుకు భయ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూగజీవాలు సైతం నీడలో చేరి సేద తీరాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ఎండల తీవ్రత ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చెరువుల్లో నీరు లేకపోవడంతో తాగునీటి కోసం పశువులు, పక్షులు ఇబ్బందులు పడుతున్నాయి.

విద్యుత్తు కోతలతో ఉక్కిరిబిక్కిరి

ఎండల తీవ్రతకు తోడుగా విద్యుత్తు కోతలు అధికంగా ఉండడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇందిరమ్మ కాలనీలో రెండు రోజుల నుంచి గాంధీబొమ్మ వీధికి విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో చీపురుపల్లి వీధి, వెలమవారివీధి, పూల్‌బాగ్, రావువారివీధి, కోరాడవీధి, టిఆర్ కాలనీ, తదితరులు ప్రాంతాల్లో తరచూ కోత విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు నిరంతరాయంగా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉక్క పోత.. కరెంటు కోత

వేపాడ : మూడు రోజులుగా ఎండ తీవ్రతతో ఉక్కపోత వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో వేడిగాలులను తట్టుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఎడాపెడా విద్యుత్తు కోతలు విధించడం వల్ల ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేపాడ, జాకేరు విద్యుత్తు ఫీడర్ల పరిధిలో విపరీతంగా విద్యుత్తు కోత విధించడంతో వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

నీడ కోసం ఇంటి గోడ పక్కకు చేరిన గేదెలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

ఘటనా స్థలంలో మృతిచెందిన పొడుగు కిశోర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని పెద్ద చెరువు రామానాయుడు రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. లంకాపట్నానికి చెందిన పొడుగు కిశోర్(19), పొడుగు హేమంత్(18) ఇద్దరూ కలసి కోట వద్ద నున్న తన అమ్మమ్మకు క్యారేజి ఇచ్చి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, వేగం వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో తల ఛిద్రం కావడంతో పొడుగు కిశోర్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను జిల్లా కేంద్రాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వీరి మృతితో లంకాపట్నంలో విషాదం అలముకుంది.

ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వివిధ ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పూల్‌బాగ్‌లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ఈ ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆశాఖ సహాయ సంచాలకులు జివిబి జగదీష్ తెలిపారు. పాఠశాలలో మొత్తం 65 మంది విద్యార్థులకు గాను 38 మంది అంధ బాలురు, బాలికలకు ప్రవేశం కల్పించేందుకు ఖాళీలు ఉన్నాయని, 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు బ్రెయిలీ లిపి ద్వారా ప్రత్యేక విద్య అందిస్తామని తెలిపారు. 6 నుంచి 14 సంవత్సరాలలోపు వయసు కలిగి, కనీసం 40శాతం అంధత్వం గల బాల బాలికలు అర్హులని తెలిపారు. ప్రవేశ సమయాన నిర్దేశించిన వైద్య ధ్రువీకరణ (సదరం సర్టిఫికేట్) తదితర పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. సాధారణ పాఠశాలలో విద్య నభ్యసిస్తూ దృష్టిలోపం గల బాల బాలికలు సంబంధిత బదిలీ, వైద్య ధ్రువీకరణ పత్రాలను సమర్పించడం ద్వారా ప్రవేశము పొందవచ్చని తెలిపారు. పాఠశాలలో ఉచిత వసతి, ఆహారం , ఆధునిక బ్రెయిలీ సామగ్రితో విద్య, ఐఎఫ్‌పి. స్మార్ట్ క్లాసెస్ , కంప్యూటర్ పరిజ్ఞానంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆసక్తి గల బాల బాలికలు నేరుగా ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల, విజయనగరం ప్రదానాచార్యులను లేదా వివరాలకు 98317548039, 7989592141, 96767 02530 నంబర్లును సంప్రదించాలని తెలిపారు.

ఆనందరాజు చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి, నాయకులు

చెరువు కబ్జా దారుణం

జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి

ప్రజాశక్తి-డెంకాడ

రైతులకు ప్రధాన నీటి వనరుగా ఉన్న చెరువును కబ్జాకు పాల్పడటం దారుణమని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. మండలంలోని గుణుపూర్‌పేట గ్రామంలో ఆనందరాజు చెరువును శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లోకం మాధవి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి పాటుపడాల్సిన అధికార పార్టీ నాయకులే చెరువును కబ్జా చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం దారుణమన్నారు. ఇంతటి ఘోరాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా, రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

పాలిసెట్ ప్రవేశాల షెడ్యూల్లో మార్పులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జూన్ మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులపాటు 144 సెక్షన్ విధింపు కారణంగా విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా పాలిసెట్ 2024 అడ్మిషన్ల ప్రక్రియలో మార్పులు జరిగినట్టు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ విలియం కేరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల వెరిఫికేషన్ తదితర ఆన్‌లైన్ ప్రక్రియ తేదీల్లో ఎటువంటి మార్పు లేదని, జూన్ 2 వరకు అవకాశం ఉంటుందన్నారు. 3న ఉన్న ధ్రువపత్రాల పరిశీలన జూన్ 6న నిర్వహిస్తామని, ప్రత్యేక కేటగిరి అభ్యర్థులకు సైతం ఇదే వర్తిస్తుందని పేర్కొన్నారు. జూన్ 7 నుండి 10 వరకు ఐచ్ఛికాల నమోదుకు అవకాశం ఉంటు ఒదన్నారు. జూన్ 11న ఐచ్ఛికాల మార్పుకు అవకాశం ఉంటుందన్నారు. జూన్ 13న సీట్ల కేటాయింపును పూర్తి చేస్తామని కమిషనర్ వివరించారన్నారు. జూన్ 14 నుండి 19 వరకు 6 రోజుల్లోపు ప్రవేశాలు ఖరారైన విద్యార్థులు ఆయా పాలిటెక్నిక్లలో వ్యక్తిగతంగా, ఆన్లైన్ విధానంలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూన్ 14 నుండే రాష్ట్ర వ్యాప్తంగా తరగతులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రాలతో పాటు ఏజెన్సీలోని పలు గిరిజన గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఈదురు గాలులు, ఉరుములు మెరుపులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఒకవైపు విద్యుత్ కోత మరోవైపు నేపథ్యంలో ఉక్కపోతతో ప్రజలను ఉక్కిరిబిక్కిరవ్వగా సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి కుండపోత వర్షం కురిసింది. అక్కడక్కడ చిన్న చిన్న చెట్టుకొమ్మలు విరిగాయి. ఎదురెదురుగా వచ్చిన వాహనాలు కనబడనంత విస్తారంగా వర్షం కురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కుండపోత వర్షంతో రోడ్లన్నీ వర్షపు నీటితో జలమయమయ్యాయి. ఇటీవల ఇంత భారీ వర్షం కురిసిన దాఖలాల్లేవని, ఎండ వేడిమి నుండి వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు, గర్భిణీలకు కొంత ఉపశమనం లభించిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షం

గుమ్మలక్ష్మీపురం: మన్యంలో శుక్రవారం సాయంత్రం భారీగా ఈదురు గాలులు వీయడంతో గుమ్మలక్ష్మీపురం - కురుపాం ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహన చోదకులు భయాందోళన చెందారు. మండ వంతెన సమీపంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలింది. దీంతో పార్వతీపురం, కురుపాం నుంచి గుమ్మలక్ష్మీపురం ప్రాంతానికి వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురు గాలులతో పాటు ఉరుములు మెరుపులు కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.ఒక్క పూటతో అల్లాడుతున్న ప్రజలు హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

కిడ్నీ బాధితులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని పెద్దూరుకు చెందిన పలువురు కిడ్నీ బాధితులను సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, కార్యదర్శివర్గ సభ్యులు యమ్మల మన్మధరావు శుక్రవారం పరామర్శించారు. అనంతరం బాధితులను సమస్యలు అడిగి తెలుకున్నారు. ఇప్పటికే ఇద్దరు కిడ్నీ వ్యాధి బారినపడి మరణించారని, మరో15 మంది వరకు బాధితులున్నట్టు తెలిపారు. ప్రస్తుతం కొంతమంది బాధితులు డయాలసిస్ చేసుకుంటున్నార న్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి తగిన పరీక్షలు జరిపినట్లయితే ఇంకా కొంత బాధితులను గుర్తించవచ్చుని నాయకులు కోరారు.

నిబంధనలు పాటించాల్సిందే

ప్రజాశక్తి-వంగర

ప్రయివేటు పాఠశాలలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంఇఒ పి.ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలతో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ.. పాఠశాలల గుర్తింపు, పిల్లల నమోదు, పరిసరాల పరిశుభ్రత, ఉపాధ్యాయుల అర్హతలు వంటి వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలకు వెళ్లి మౌలిక వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అరసాడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.జగదీశ్వరి, కమిటీ సభ్యులు, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టుదల, కృషి ఉంటేనే ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టుదల, కృషి ఉంటే మంచి ఉద్యోగాలు సాధించవచ్చని సీనియర్ క్రీడాకారులు రావు శ్రీనివాసరావు అన్నారు. పాత చక్కెర పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసిన వీర బొబ్బిలి క్రీడా మైదానం మూడో వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 400 మంది ఉద్యోగాలు సాధించారని చెప్పారు. యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న శ్రీనివాసరావును వ్యాపారి చౌదరి, తైక్వాండో కోచ్ బంకురు ప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎండిఎంపై శిక్షణ

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై నిర్వాహకులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావు ఆధ్వర్యంలో సిసిహెచ్ మాస్టర్ ట్రైనర్ జి.లక్ష్మి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం ప్రదర్శించారు.

మధ్యాహ్న భోజన వంటకాల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఇఒలు

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - జామి

మండల కేంద్రం జామిలోని మాధవరాయి మెట్ట వద్ద రామాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు భవాని ప్రసాద్, బోడసింగి అప్పలరాజు, మండల నాయకులు మట్టా జనార్దన రావు, ఆలయ కమిటీ సభ్యులు కోటయ్య, కొరుపోలు అప్పారావు, చింతాడ నర్సింగరావు పాల్గొన్నారు.

కండేపల్లి మెట్టపై

గో(భూ)విందుడి ఆగడాలు

- మెట్ట ఆక్రమణతోపాటు వాగులను, గెడ్డలను మింగేస్తున్న వైనం
- కట్టెల కోసం వచ్చే గ్రామస్తులకు బెదిరింపులు
- విఆర్ఒ, సర్వేయరుపై దౌర్జన్యం
- తమ పరిధిలో లేదంటూ రెవెన్యూ, అటవీ శాఖల నిర్లక్ష్య వైఖరి

మెట్టపై తవ్వకాలు సాగిస్తున్న పొక్లెయినర్

ప్రజాశక్తి - శృంగవరపుకోట

జీవకోటికి ప్రాణాధారమైన నీటి వనరులను, కొండలను, గుట్టలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉంది. కానీ కొందరు కబ్జాదారులు మాత్రం అందుకు భిన్నం. కొండలను డొలిచేస్తూ, వాటి నుంచి వచ్చే నీటి వనరులైన గెడ్డలు, వాగులు కప్పేస్తూ ప్రకృతి విధ్వంసానికి తెరలేపుతున్నారు. అడిగిన స్థానిక రెవెన్యూ అధికారులను సైతం ఖాతరు చేయడం లేదు. దీన్నిబట్టి వీరికి ఏ స్థాయిలో అండదండలు అందుతున్నాయో అర్థమవుతోంది.

మండలంలోని పెదకండేపల్లి, కృష్ణాపురం సచివాలయాలకు సంబంధించి కండేపల్లి కొండమెట్ట ప్రాంతం ఆ గ్రామాలకు శివారున ఉంది. దీంతో ఇక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఇదంతా ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉంది. ఇక్కడ గతంలో సుమారు 100 ఎకరాలు కొనుగోలు చేసిన గోవిందరావు అనే వ్యక్తి ప్రస్తుతం ఈ మెట్ట భాగమంతా తనదేనని చెబుతున్నాడు. ఇంకా తనకు కొండలో మరో ఏడు ఎకరాల స్థలం ఉందని చెబుతూ రెండు నెలలుగా పెద్ద ఎత్తున తవ్వకాలు సాగిస్తున్నాడు. పొక్లెయినర్లతో తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా రవాణా సాగిస్తున్నాడు. స్థానికులు ఎవరైనా మెట్ట ప్రాంతంలో అడుగుపెట్టకుండా దౌర్జన్యం సాగిస్తున్నాడు. విఆర్ఒ, సర్వేయరు వస్తే, వారిని లెక్కచేయడం లేదు.

మెట్ట దిగాలంటే కట్టెలు విడవాల్సిందే

కృష్ణాపురం పంచాయతీ భీమవరం గ్రామస్తులు ఎవరైనా కట్టెల కోసం సమీపంలోని మెట్టపైకి వెళ్లడానికి భయపడుతున్నారు. మెట్టపైకి వెళ్లే గ్రామస్తులపై ఈ గోవిందుడు శివతాండవం ఆడటమే అందుకు కారణం. కట్టెలను విడిచి పెడితే గాని గ్రామస్తులను ఎవరినీ మెట్ట దిగనివ్వడం లేదు. మెట్ట మొత్తం తనదేనని, ఈ ప్రాంతంలో ఎవరూ అడుగు పెట్టకూడదని హుకుం జారీ చేస్తున్నాడు.

పరిహారంగా ఇచ్చిన మెట్ట

మండలంలోని గిరిశిఖర గ్రామాలున్న దారపర్తి పంచాయతీకి రోడ్డు నిర్మాణానికి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాన్ని ప్రభుత్వం సేకరించింది. దీనికి పరిహారంగా పెదకండేపల్లి పంచాయతీ రెవెన్యూలో 108 ఎకరాలు, కృష్ణాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న సుమారు 70 ఎకరాల మెట్ట భాగాన్ని అటవీశాఖకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. కృష్ణాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న 110 ఎకరాల్లో పెదకండేపల్లి వైపునున్న 70 ఎకరాల మెట్ట భాగాన్ని అటవీశాఖకు ఇచ్చేశారు.

మా పరిధి కాదు

మెట్ట ఆక్రమణపై అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. 'మెట్టలో అటవీ శాఖకు స్థలం ఇచ్చాం. అది మా పరిధిలోకి రాదు. మీరు అటవీశాఖ అధికారులకు వెళ్లి తెలియజేయండి. ఈ మెట్ట ఆక్రమణ విషయమై రెవెన్యూ శాఖ ఏమీ చేయలేద'ని తహశీల్దార్ కిరణ్ కుమార్ బదులివ్వడం గమనార్హం. 'ప్రభుత్వం అటవీ శాఖకు అప్పగించిన భూమిలో తవ్వకాలు జరగడం లేదు. మెట్టకు వేరే ప్రాంతంలో జరుగుతున్నాయి. ఆ ప్రాంతం మా శాఖకు సంబంధించింది కాదు. మీరు రెవెన్యూ శాఖ అధికారులకే తెలియపరచండి' అంటూ అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఇలా ఎవరికి వారు తమకు సంబంధంలేని విధంగా సమాధానాలు చెప్పడం విశేషం.

మండల సమావేశాల్లో ప్రస్తావించా

మెట్ట వద్ద ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని గతంలో జరిగిన మండల సమావేశాల్లో ప్రస్తావించినా.. నా మాట ఎవరూ వినలేదు. ఈ విషయం విఆర్ఒ, సర్వేయర్‌కు పలుమార్లు తెలియజేశాను. ఇటీవల విఆర్ఒ తవ్వకాల వద్దకు వెళ్తే ఆ వ్యక్తి నిర్లక్ష్యంగా మాట్లాడారు. ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలి.

- యామినీ దేవి, కృష్ణాపురం సర్పంచ్

సర్వే రాళ్లు వేయనివ్వలేదు

జగనన్న సమగ్ర భూ సర్వేలో భాగంగా ఈ మెట్ట ప్రాంతం సర్వే చేసి రాళ్లు వేసేందుకు ప్రయత్నించాం. ఎవరూ రాళ్లు వేయవద్దని తన భూమిలో తానే రాళ్లు వేసుకుంటానని చెప్పి జగనన్న సమగ్ర భూ సర్వే రాళ్లను తీసుకున్నాడు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక సర్వే నిర్వహిస్తాం.

- మండల సర్వేయర్ వెంకటరావు

వికలాంగ పిల్లలను పాఠశాలలో చేర్పించండి

డిఇఒ ప్రేమ్‌కుమార్

వికలాంగ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బడిఈడు గల వికలాంగ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ కోరారు. విద్యాశాఖ - సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో బడి ఈడు, బడి బయట గల వికలాంగ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు మే 1 వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జిల్లాలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లలో 12 మండలాలకు చెందిన సహిత విద్య ఉపాధ్యాయులు (ఐఇఆర్‌పిలు) 7 బృందాలుగా ఏర్పడి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు తల్లిదండ్రులను కలిసి పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. ఈ పిల్లల కోసం పాఠశాలలో వారి అవసరాలు మేరకు రైలింగ్ ర్యాంపులు, ఫ్రెండ్లీ టాయిలెట్లు, బోధనోపకరణాలు, ప్రత్యేక ఉపాధ్యాయులు వంటి అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంతో పాటు ప్రతి మండలం కేంద్రంలో వికలాంగుల పిల్లల కోసం భవిత కేంద్రం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ ఈ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పేందుకు ఇద్దరు ప్రత్యేక ఉపాధ్యాయులు ఉంటారని చెప్పారు. ఇక్కడ శారీరక వైకల్యాలు ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో కొత్తగా 70 మంది బడి ఈడు, బడి బయట గల పిల్లలను గుర్తించారు. కార్యక్రమాన్ని జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ ఎస్.సూర్యారావు, సహాయ కోఆర్డినేటర్ ఎం. భారతి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పలువురు సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధూమపానంతో తీవ్ర అనర్థాలు

కొత్తవలస... ధూమపానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-బొబ్బిలి

చుట్ట, బీడి, సిగరెట్ ఏ రూపంలోనైన పొగ తాగడమంటే జీవితానికి పొగపెట్టుకోవడమేనని రోటరీ క్లబ్ బొబ్బిలి అధ్యక్షులు జెసి రాజు ఆందోళన వ్యక్తంచేశారు. ధూమపానంతో తీవ్ర అనర్థాలు సంభవిస్తాయని చెప్పారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్ఆర్ఐ హాస్పిటల్ ప్రాంగణంలో రోటరీ క్లబ్, ఎన్ఆర్ఐ హాస్పిటల్ సంయుక్తంగా పొగాకు వాడకం వల్ల నష్టాలు అనే విషయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఆర్ఐ హాస్పిటల్ డాక్టర్ వాణి మాట్లాడుతూ సరదాగా పొగతాగడం అలవాటు చేసుకున్నాక.. అది జీవితాలను కబళిస్తోందని చెప్పారు. యువత ధూమపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎన్ఆర్ఐ సిఇఒ సింద్రీ శ్రీనివాసన్ కోరారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఎఒ అవినాష్ చంద్రశేఖర్, దుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస : వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముసిరాం, తుమ్మికాపల్లి, రామలింగాపురం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, హెచ్‌వి. పద్మావతి, హెచ్ఎస్ ఈశ్వరరావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, సిబ్బంది ఆశాజ్యోతి, సత్యారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యంగా జీవించాలని పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యులు రాజేష్ వర్మ, ప్రమీల అన్నారు. పూసపాటిరేగ పిహెచ్‌సిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి లక్ష్మీ శైలజ, వైద్య సిబ్బంది మహేశ్వరి, ఉమాపతి, ఆర్.వి.రమణ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్న పేట జంక్షన్ వద్ద ప్రజల్లో పొగాకు వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమానికి ముందుగా క్లబ్ గౌరవ అధ్యక్షులు, వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్-102 మాజీ గవర్నర్ డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, క్లబ్ గౌరవ సలహాదారులు ఆరికతోట తిరుపతిరావు, క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఐవి ప్రసాదరావు, కోశాధికారి ఆర్‌సిహెచ్ అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీనివాసరావు, క్లబ్ సీనియర్ సభ్యులు పెనుమత్స అప్పలరాజు, సిహెచ్ రమణ, టి.రమణ,రైల్వే రామకృష్ణ, చక్రధర్ పట్నాయక్ పాల్గొన్నారు.

పైపులైన్ లీకులతో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

పైపులైన్ లీకులను నివారించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో పైపులైన్ లీకులను నివారించాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి... మున్సిపల్ డిఇ రవికుమార్‌ను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని రైల్వేజంక్షన్, ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్, ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి పారిశుధ్యాన్ని, పైపులైన్ లీకులను పరిశీలించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో పైపులైన్ లీకులతో తాగునీరు వృథాగా పోవడంతో లీకులను నివారించాలని ఆదేశించారు. రోడ్లపై, కాలువలో చెత్త లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కెవిడి ఉద్యోగుల ఔదార్యం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన కెవిడి ఉద్యోగులు మరోసారి ఔదార్యాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు శుక్రవారం రూ.60 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల గుర్ల మండలం భూపాలపురం గ్రామానికి చెందిన నైదాన వెంకటలక్ష్మి ఆటోలో వెళ్తుండగా ముద్దాడ, తమతాడ మధ్యలో ఆటో బోల్తా పడింది. వెంకటలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకటలక్ష్మిది నిరుపేద కుటుంబం కావడంతో కొండవెలగాడ ఉద్యోగులు స్పందించి, విజయనగరంలోని ఆస్పత్రికి వెళ్లి బాధితురాలి తల్లిదండ్రులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు.



బాధితురాలి తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందజేస్తున్న కెవిడి ఉద్యోగులు

శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

స్ఫూర్తిదాయకుడు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉద్యోగులకు ఎంతో స్ఫూర్తిదాయకమైన వ్యక్తులు జెడ్‌పి ఎఒ, సెట్విజ్ మేనేజర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి అని జిల్లా పరిషత్ సిఇఒ రాజ్ కుమార్, సెట్విజ్ సిఇఒ బి.రాంగోపాల్ అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాసరావు, లక్ష్మీదేవి దంపతులను జెడ్‌పి సమావేశ మందిరంలో ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఉద్యోగుల్లో పోరాటమంటే శ్రీనివాస రావే గుర్తొస్తారన్నారు. సమైక్య ఆంధ్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సెట్విజ్‌కు తాత్కాలిక బదిలీపై వచ్చిన నాటి నుంచి కీలక పాత్ర పోషించారని తెలిపారు. భార్య భర్తలు ఇద్దరూ ఒకేరోజు రిటైర్మెంట్ తీసుకోవడం అదృష్టమని అన్నారు. నిజాయితీ నిబద్ధతతో పనిచేసిన వ్యక్తి, రానున్న తరానికి శ్రీనివాసరావు లాంటి వ్యక్తులు రావాలని ఆకాంక్షించారు. సన్మాన అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ ప్రయాణంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ వాటిని మంచి మార్గంగా కల్పించుకొని ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించానన్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా చేరి ఈ స్థాయిలో ఉద్యోగ విరమణ పొందడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి, అప్పల నాయుడు, చిరంజీవి, బొత్స రమేష్ ,వెంకట్రావు, జిల్లా పరిషత్, సెట్విజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగు రైతుకు బాగు

గరుగుబిల్లి : ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తేనే రైతు ఆర్థికంగా అభివృద్ధి అయ్యేందుకు అవకాశం ఉంటుందని ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని సంతోషపురం రైతు భరోసా కేంద్రం వద్ద నవ ధాన్య విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పలు సూచనలు చేశారు. వరి సాగు చేసే ముందుకు నవధాన్యాలు వేసుకోవాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

గాబువానిపేటలో చోరీ

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని ముంజేరు పంచాయతీ గాబువానిపేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బీరువాలో ఉన్న పదివేల నగదు, రెండు తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ రవికుమార్ కథనం ప్రకారం... ఎండాకాలం కావడంతో నక్క రాంబాబు తన భార్య రమతో కలిసి డాబాపై పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం బీరువాలో ఉన్న నగదు, ఆభరణాలను దోచుకున్నారు. నక్క రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

ఈ బీరువాలో ఉన్న నగదు, ఆభరణాలు దోచుకున్నారు

అప్రమత్తంగా ఉండాలి

వేసవి కాలం కావడంతో గ్రామాల్లో ప్రజలు ఆరు బయట, మేడపై నిద్రిస్తున్నారు. దీన్ని అవకాశంగా తీసుకొని దొంగలు ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారం దొంగిలించుకుని పోతున్నారు. భోగాపురం మండల ప్రజలంతా ఈ విషయమై అప్రమత్తంగా ఉండాలి. రాత్రిపూట ఎవరైనా అనుమానితుల కదలికలను గమనిస్తే వెంటనే డయల్ 100కి గాని, భోగాపురం పోలీస్ స్టేషన్ నెంబర్ 9154879651, 9121109445కు గాని వెంటనే తెలియజేయాలి.

- సిఐ రవికుమార్

ద్విచక్ర వాహనాలు ఢీ

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో నలుగురు యువకులకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108 వాహనంలో తగరపువలసలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన సవరవల్లి సమీపంలోని అమనం జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సవరవల్లి గ్రామానికి చెందిన బోర రమేష్, గారి గణేష్, బోర జగన్.. ముగ్గురు ఒకే బైకుపై పోలిపల్లి వైపు నుంచి సవరవల్లి వైపు వస్తున్నారు. అదే మార్గంలో పోలిపల్లి వైపు ఒడిశా రాష్ట్రం జైపూర్ జిల్లాకు చెందిన జావేద్ అక్తర్ వస్తున్నాడు. ఏమైందో తెలియదు గానీ రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బోర రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

IN THE HON'BLE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: KOTHAVALASA O.S 79/2023

Between:
Pureddy Atchanna Reddy ...Plaintiff
And:
Lenka Parvathi& another ...Defendants

NOTICE

To
Defendant No.1:
Lenka Parvathi, W/o. Appa Rao, R/o. Ardhannapalem Village, Kothavalasa Mandal, Vizianagaram District-535183

Please take notice that the above suit, which is filed by the plaintiff againstyou for specific performance of the sale agreement dated 25-11-2019 executed byyou and 2nd defendant in favour of the plaintiff, stands posted to **27-06-2024** foryour notice. If you have any objection you may attend either personally orthrough an Advocate before the above said Court at **10.30 A.M.,** on **27-06-2024**, failing which the matter will be decided exparte in your absence.

(By Order of the Hon'bleCourt)
P.Ramji & M.(P).Hemalatha,
Advocates,
Visakhapatnam-9
Cell: 98481 63349